గుంతల రోడ్డును బాగుచేయండి

- ప్రయాణికుల, వాహనదారుల విన్నపం


గుంతల మయంగా రోడ్డు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రం నుంచి తూంపల్లి వరకు గత ప్రభుత్వం డబుల్ వే రోడ్లను నిర్మించారు. కన్నాపూర్ నర్సరీ వద్ద అడవి భూమి కారణంగా సింగల్ వే ఉండడం, వర్షానికి రోడ్డు పక్కన గల మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నాలుగు చక్రాల వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే వాహనం కింద దించాలంటే ప్రమాదం పొంచి ఉంద వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి డబల్ వే నిర్మించాలని, అప్పటివరకు అధికారులు స్పందించి రోడ్డుకు ఇరుపక్కల మట్టిని వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బతుకమ్మ చెరువుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

- సిపిఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్


మాట్లాడుతున్న నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని

బతుకమ్మ చెరువుల వద్ద సౌకర్యాలు కల్పించాలని సిపిఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ మహిళలు బతుకమ్మ పండగలో భాగంగా నిమజ్జనం చేసే చెరువుల వద్ద ప్రమాదాలు జరుగకుండా ముందుగా విద్యుత్ దీపాలు, చెరువు కట్టపై మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా గత ఏడాదిలో జరిగిన ప్రమాదాలను గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రమాదాలు జరగకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట సాయిబాబా, లక్ష్మణ్ తదితరులున్నారు.

దేవునిపల్లిలో నివాసపు గుడిసె దగ్ధం

- రూ.50 వేల ఆస్తినష్టం


దగ్ధం అయిన గుడిసే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులోని (దేవునిపల్లి) హెూలియా దాసరి కాలనీకి పెండ్యాల సాయిలు తన నివాసపు గుడిసె బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. బాధితుడి వివరాల ప్రకారం.. తన గుడిసెలో నిత్యావసర సరుకులు, వస్తువులు, దుస్తులు, ద్విచక్ర వాహనం కాలిపోయాయని, సుమారు అన్ని వస్తువులు కలిపి రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని పోలీసులు, రెవిన్యూ అధికారులు సందర్శించి విచారణ చేపట్టారు. కాగా గురువారం ఉదయం బాధిత కుటుంబాన్ని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజుపాటిల్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పేద ప్రజలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పేదలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు గత ఎనిమిది సంవత్సరాల నుండి పట్టణంలో యానం గుట్ట సుందరయ్య కాలనీలో గుడిసెలేసుకొని ఇల్లు కట్టుకొని అక్కడే నివాసం ఉంటున్నారని వారందరూ అనేక సంవత్సరాలుగా ఇంటి నెంబర్లు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినప్పటికీ పరిష్కారం చేయట్లేదు అన్నారు. అనంతరం సిపిఐ(ఎం) ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. డబ్బు ఉన్న వాళ్లకు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టకపోయినా ఇంటి నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని, అంటే పేదవాళ్ళకి ఇంటి నంబర్లు ఇవ్వకపోవడం డబ్బున్న వారికి ఇంటి నెంబర్లు ఇవ్వడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని ఇల్లు కట్టుకున్న వాళ్ళందరికీ ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య, డివిజన్ కమిటీ సభ్యులు బి.రవి, భూమన్న, ఈడగొట్టి సాయిలు, ఓంకార్, దండోగుల సాయిలు, నవీద్, కిషన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న

బొప్పాస్‌పల్లి విత్తనక్షేత్రం

- క్షేత్రం భూమి కబ్జా అయినా పట్టించుకోరా..?
- నిద్రావస్థలో అధికార ఘనం
- కలెక్టర్ దృష్టిసారించాలి : రైతులు


కబ్జాకు గురైన భూమి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీడు భూములను సైతం సస్యశ్యామలం చేసేందుకై ఏర్పడిన వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం నేడు వెలవెలబోతోంది. గత ప్రభుత్వాల తప్పిదాల కారణంగా విత్తనక్షేత్రం గత వైభవాన్ని కోల్పోయింది. రైతులకు మేలైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వమే స్వయంగా ఒక విత్తన అభివృద్ధి క్షేత్రం ఏర్పాటు చేయాలని సంకల్పంతో 1956లో కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని బొప్పాస్‌పల్లి శివారులో సుమారు 500 ఎకరాలాల్లో వ్యవసాయ విత్తన అభివృద్ధి క్షేత్రం ఏర్పాటు చేశారు. 1956 నుంచి 1995 వరకు నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసి రాష్ట్ర సీడ్ సంస్థ ద్వారా రైతుకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశారు. రానురాను ఉత్పత్తి చెయ్యడం మానేశారు. అధికారులు బదిలీలపై వెళ్లడంతో కొందరు క్షేత్రం భూమిని కబ్జాకు గురవుతోంది.

బొప్పాస్‌పల్లి వ్యవసాయ విత్తన అభివృద్ధి క్షేత్రం ప్రస్తుతం 216 ఎకరాల్లో వరి పంట సాగు చేసేందుకు భూములు అనుకూలంగా ఉన్న ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పంటసాగు చెయ్యడం మానేశారు. వ్యవసాయక్షేత్రంలో ఉత్పత్తి అయిన హైబ్రిడ్ వరి విత్తనాలను బీర్కూర్, నసురుల్లాబాద్, బోధన్, బాన్సువాడ, మహ్మద్‌నగర్, పిట్లం, సారంగాపూర్‌లో విత్తన గిడ్డంగుల్లో ఉంచి రైతులకు విత్తనాలు సరఫరా చేసేవారు. కాలక్రమేణ బొప్పాస్‌పల్లి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఇతర జిల్లాల రైతులు సైతం ఈ విత్తనాలను కొనుగోలు చేసేవారు. ఈ విత్తనాలతో పండిన పంటలను పరిశీలించేందుకు ప్రత్యేకాధికారులు ఉండేవారు. క్షేత్రం భూమి కబ్జా అయిన రెవెన్యూ శాఖ, క్షేత్రం అధికారులు, పోలీస్ శాఖ బాధ్యత రహితంగా వ్యవరించడం వలనే కొందరు క్షేత్రం భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నారు. 1986లో టిడిపి హయాంలో ఈ క్షేత్రానికి నిధులు తగ్గించి అధికారులను, సిబ్బందిని బదిలీ చేయడంతో విత్తన అభివృద్ధి కుంటుపడింది. 2001లో క్షేత్రం కొంత వరకైన విత్తనాలు ఉత్పత్తి చేసేవారు. అధికారుల నిర్లక్ష్యం పాలక నాయకుల అలసత్యంతో విత్తన అభివృద్ధి క్షేత్రంలో అధికారుల ఇష్టారాజ్యం సాగింది. 2003లో క్షేత్రం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయగా విత్తనాలు ఉత్పత్తిని వదిలి భూములను చదును చేసేందుకు నిధులు ఖర్చు చేశారు. ఈ నిధుల్లో అవినీతి జరిగిందని అప్పటి అధికారులు సైతం తేల్చి చెప్పారు. వ్యవసాయ క్షేత్రం అభివృద్ధి పేరుతో నిధులు మంజూరవుతుండగా జిల్లా వ్యవసాయ అధికారులు, క్షేత్రఅధికారులు నిధులను పక్కదారి పట్టిస్తున్నారని.. అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తమకు చెప్పేవారెవరనే ధీమాలో ఉంటూ నిధులను మాయం చేశారని ఆరోపణలు ఉన్నాయి.

బొప్పాస్‌పల్లి వ్యవసాయక్షేత్రం ఎక్కడ ఉందో ఇప్పటికీ కొందరికి తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా అధికారులు మూడేళ్లకోసారి వస్తుపోతుంటారే గానీ క్షేత్రం వైపు కన్నెత్తి చూడకపోవడంతో కబ్జాదారులు మరింత భూమిని కబ్జా చేస్తున్నారు.

కబ్జా కోరల్లో క్షేత్రం భూములు..

బొప్పాస్‌పల్లి వ్యవసాయ విత్తన అభివృద్ధి క్షేత్రం 500 ఎకరాలు ఉండగా, అందులో 216 ఎకరాలు సాగవుతోంది. మిగతా భూమి బీడుగా ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రం భూమి కబ్జాకు గురైనట్లు సమాచారం. 2004లో ఓ అధికారి కబ్జాదారునిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజకీయ ఒత్తిళ్లతో ఆ సమస్య సద్దుమణిగించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విత్తన అభివృద్ధి క్షేత్రభూమి విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉంది. క్షేత్రం భూమి ఎంతవరకూ ఉందో అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. క్షేత్రం భూమి కబ్జాకు రెవెన్యూ, పోలీస్, క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిధులు పక్కదారి ?

క్షేత్రం అభివృద్ధి కోసం వస్తున్న నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాసరెడ్డి సొంత నియోజకవర్గంలోని ఈ బొప్పాస్‌పల్లి వ్యవసాయ విత్తన అభివృద్ధి క్షేత్రం ఉండడం విశేషం. వ్యవసాయ రంగంపై పూర్తిగా అవగాహన ఉన్న పోచారం ఈ క్షేత్రానికి పూర్వ వైభవం తేవాలని రైతులు, ప్రజలు ఎంతో కోరుకుంటున్నారు. గాడితప్పిన వ్యవసాయక్షేత్రాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై ఉంది.


విత్తన క్షేత్ర కార్యాలయం

గీత కార్మికుల సమస్యలపై

సమరశీల పోరాటాలు

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు
- 67వ వార్షికోత్సవ కరపత్రాలు విడుదల




కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కల్లుగీత కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో గల జిల్లా కార్యాలయంలో 67వ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1944లో బ్రిటిష్ పరిపాలనలో ఆంధ్రలోని గీత కార్మికులను అనేక ఇబ్బందులు పెడుతుంటే దాన్ని చూసి తట్టుకోలేక ఆనాడు దాట్ల సూర్యనారాయణ రాజు కల్లు గీత కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ తర్వాత తెలంగాణలో వరంగల్‌లో ఆవిర్భావం జరిగి నేటికి 67 వసంతాలు పూర్తి చేసుకున్నదన్నారు. నాటి నుండి నేటి వరకు కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత 2014లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అవతరించిందని వివరించారు. కల్లుగీత వృత్తి రక్షణ, కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసమే పని చేస్తూ మన సంఘం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి గీత వృత్తిలో వస్తున్న అసంతృప్తులను దూరం చేస్తూ, ప్రమాదాలను, మరణాలను తగ్గించుకునే విధంగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సేఫ్టీ మోకులను సాధించుకుందన్నారు. అలాగే పోరాడి సాధించుకున్న సొసైటీలలో, టిఎఫ్టిలను చట్టంలో, పాలసీలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని బోగస్ దారులు ప్రవేశించారని, భోగదారుల వల్ల గీత వృత్తికి నష్టం జరిగే ప్రమాదం ఉందని, ఇప్పటికే అత్యంత ప్రణాపాయకమైన కల్లు గత వృత్తిని భవిష్యత్తు తరాలకు దూరం చేస్తున్నారని తెలిపారు. అందుకోసం సాధించుకున్న సేఫ్టీ మోకుల విధానాన్ని భవిష్యత్తులో గీత వృత్తి సంక్షేమ కోసం అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అనేక పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. వీటన్నింటి చర్చించడానికి ఈనెల 18న హైదరాబాద్ సుందర విజ్ఞాన కేంద్రంలో జరిగే 67 వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. అలాగే అవకాశం ఉన్నచోట జిల్లాలో కూడా 67వ వార్షికోత్సవ సభలను నడపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింలు గౌడ్, శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులోకి కొనసాగుతున్న భారీ వరద



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 24,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ అన్నారు. ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని, కావున మూడు గేట్ల ద్వారా 22,500 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీర నదిలోకి వదలగా 1500 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ద్వారా వదులుతున్నట్లు ఆయన తెలిపారు. నీటి ప్రవాహం ఎక్కువ ఉన్నందున నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతానికి ప్రాజెక్టులో 17.744 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డీఎస్సీలో క్వాలిఫై అయిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను

క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

డీఎస్సీ 2024లో క్వాలిఫై అయిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన తీరును గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1240 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అందరి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్టు తెలిపారు. అక్టోబర్ 5లోగా పరిశీలన పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నందున సర్టిఫికెట్ల పరిశీలనకు 10 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి రాజు, తదితరులున్నారు.

డిజిటల్ కార్డు సర్వేను

పరిశీలించిన సబ్ కలెక్టర్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఫ్యామిలీ డిజిటల్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని బోధన్ డివిజన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో అన్నారు. గురువారం మండలంలోని ప్రాజెక్ట్ పైలెట్ గ్రామంగా ఎంపికైన లంగాపూర్ గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించి మాట్లాడారు. తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు సంబంధించిన సర్వే పైలెట్ పథకంగా 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనుందని తెలిపారు. ఈ పైలెట్ పథకం తెలంగాణలోని 119 నియోజకవర్గాలలో ఒకొక్క నియోజకవర్గంలో గ్రామం, ఒక మునిసిపాలిటీ వార్డ్ చొప్పున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బోధన్ నియోజకవర్గంలో లంగ్డాపూర్ గ్రామాన్ని బోధన్ మున్సిపాలిటీ నుండి 25వ వార్డును ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ పథకం కింద ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా జోనల్ కమిషనర్ ఈ మొత్తం సర్వేను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఒక సర్వే టీంలో కనీసం 3-4 ప్రభుత్వ అధికారులు ఉంటారని తెలిపారు. టీం లీడర్‌గా ఎం.పి.డి.ఓ, తహసిల్దార్ వ్యవహరిస్తారన్నారు. ప్రతి కుటుంబ సభ్యులు ఈ సర్వేలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సర్వేలో తహశీల్దార్ విఠల్, ఎంపీఓ మధుకర్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, నాయకులు గంగాశంకర్, పాషా తదితరులున్నారు.

తప్పిదాలకు తావులేకుండా

సమగ్రంగా డిజిటల్ కార్డుల సర్వేచేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


డిచ్‌పల్లి: వివరాల సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్


కామారెడ్డి: సర్వేలో పాల్గొన్న కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్/డిచ్‌పల్లి/కామారెడ్డి

కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లిలో, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్-2 పరిధిలో కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఫ్యామిలీ డేటా బేస్ ఆధారంగా అధికారులు సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సమగ్రంగా పొందుపర్చాలని అన్నారు. ఇంటి నెంబరు, చిరునామా, కుటుంబ యజమాని ఎవరు, ఇతర కుటుంబ సభ్యులకు యజమానితో గల సంబంధం వంటి వివరాలను పక్కాగా సేకరించాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయంలోపు పైలెట్ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా నూటికి నూరు శాతం డిజిటల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్, ఎంపిడిఓ రవీందర్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి..

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి : ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో కుటుంబ సర్వే పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా పూర్తి సమాచారంతో నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని మున్సిపల్, గ్రామాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాలలో సర్వే పనులు టీమ్‌ల ద్వారా ఈ నెల 7వరకు జరుగుతాయని తెలిపారు. ఆర్డీఓ రంగ నాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు

- మహిళా సాధారికత ముందడుగు
- ఎస్‌బిఎం నారాయణ


స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసిన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు మహిళలు ముందుకు రావడం అభినందనీయమని స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ అన్నారు. గురువారం మండలంలోని పోల్కంపేట్ గ్రామపంచాయతీలో స్వచ్ఛతాహి సేవ ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా నెహ్రూ మహిళా సంఘాల ద్వారా స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి ఐడి కార్డులు ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బిఎం కోఆర్డినేటర్ నారాయణ, డిఎల్పిఓ సురేందర్, ఎంపిడిఓ నరేష్, ఎంపిఓ మలహరి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ మంత్రి పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే


ఏర్పాటు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన ఏర్పాట్లను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుధర్శన్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు. నిజామాబాద్ బస్ స్టాండ్‌లో ఆర్టీసీ అధికారులతో కలిసి గురువారం ఏసీ బస్సుల ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మంత్రి పొన్నంతో పాటు మరి కొంత మంది మంత్రులు ఆర్టీసీ ఏసీ బస్సులను ప్రారంభించనున్నారు. ఆయనవెంట ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, నగేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛత జీవన విధానం కావాలి

- రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ (ఏడీఎఫ్ఎం) సాల్వన్ సంగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని హైదరాబాద్ రైల్వే డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ (ఏడీఎఫ్ఎం) సాల్వన్ సంగ తెలిపారు. నిజామాబాద్ జంక్షన్ రైల్వే స్టేషన్ లో గురువారం స్వచ్ఛత పక్వాడలో భాగంగా రైల్వే స్టేషన్ ప్లాట్ పామ్, రైల్వే ట్రాక్, తదితర ప్రదేశాలలో శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛత పక్వాడను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా నిత్యజీవితంలో పరిశుభ్రత విధానాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ సదాశివుడు, హెల్త్ ఇన్స్పెక్టర్ ప్రేమ సాగర్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ దీప, కమర్షియల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఉదయ్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీపీసీసీ సన్మాన సభను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేస్తున్న టిపిసిసి సన్మాన సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పాత కలెక్టర్ గ్రౌండ్ (సన్మాన సభ స్థలం) వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌కు ఘనంగా స్వాగత ర్యాలీ, బహిరంగ సన్మాన సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్,నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు,పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్ఎస్‌సీ స్నేహితులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పట్టణకేంద్ర పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కొందరు పూర్వ విద్యార్థిని కొంగి జమునకు 44,500 రూపాయల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. మా తోటి పూర్వ విద్యార్థిని అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆమె కుటుంబానికి అండగా నిలబడాలని తలా కొంత పోగుచేసి ఆమెకు ఆర్థిక సాయం అందించమన్నారు. అవసరమైతే మరింత సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోషమ్మ, రజిత, కల్పన, భోజ లత, వైదేహి, లక్ష్మీనారాయణ, అశోక్, భాస్కర్, మోహన్, భూమేశ్వర్, సృజన్, నరహరి, రవి, నరేష్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్ట్ ను నగరంలోని 38వ డివిజన్ ఆదర్శ్ నగర్ లో సేకరిస్తున్న వివరాలను నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శుక్రవారం పరిశీలించారు. సర్వే చేసేవారు తప్పనిసరిగా అధికారుల సూచనల మేరకు నడుచుకోవాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ జనార్దన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

- రేంజ్ అధికారి రవి మోహన్ భట్



మాట్లాడుతున్న రేంజ్ అధికారి రవిమోహన్‌భట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అడవి లో ఉండే ప్రతి వన్యప్రాణులను కాపాడుకుందామని దాని కోసం అటవీ అదికారులకు సహకరించాలని ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్ అన్నారు. 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో బాగంగా ఇందల్ వాయి రేంజ్ పరిధిలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ వారోత్సవాలు గురువారం నుండి ఈనేల 9 వరకు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని రేంజ్ అధికారి తెలిపారు. కార్యక్రమం లో డిప్యూటీ రేంజ్ అధికారి తూకరం రాథోడ్, ఫారెస్ట్ సెక్షన్, బీట్ అధికారులు, స్ట్రయికింగ్ ఫోర్స్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యానికి నిరసన

- జిల్లా కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆందోళన


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న మహమ్మద్ అబ్దుల్ కలీమ్‌పై పోలీసుల భౌతిక దాడి అత్యంత హేయమైన చర్యగా నిజామాబాద్‌బార్ అసోసియేషన్ ఆక్షేపించింది. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హల్‌లో అత్యవసర సమావేశంలో బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, వి.భాస్కర్, పరుచూరి శ్రీధర్, మద్దెపల్లి శంకర్ మాట్లాడుతూ.. చట్టవిరుద్ధంగా న్యాయవాదిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన మాదన్నపేట్ పోలీసులను అరెస్ట్ చేసి చట్టప్రకారం శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై పోలీసుల బౌతిక దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సమాయత్తం కావలసిన అవసరం ఏర్పడిందని అన్నారు. అనంతరం బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదు లపై పోలీసుల అరాచకాలు, హింస పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో మహమ్మద్ అబ్దుల్ కలీమ్ పై దాడి చేసిన మదన్నపేట్ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యులైన పోలీస్ అధికారులను తక్షణమే తక్షణమే సస్పెన్షన్ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల వృత్తి ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల చట్టవ్యతిరేకమైన చర్యలకు నిరసనగా రెండు రోజులు విధులకు హాజరుకాకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశం అనంతరం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ముందు నిలబడిన న్యాయవాదులు మాదన్నపేట్ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాదన్నపేట్ పోలీసుల దిష్టిబొమ్మను దహనం చేశారు. దీర్ఘకాలిక పోరాటానికి తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ కార్యాచరణ రూపొందిస్తున్నదని మల్లెపూల జగన్మోహన్ మోహన్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొన్పాల్ సురేష్,న్యాయవాదులు మధుసూదన్ రావు, కవిత రెడ్డి, మానిక్ రాజు, ఆశా నారాయణ, పడిగల వెంకటేష్, నగేష్, రవీందర్, నల్ల సుభాష్ రెడ్డి, ఇంతియాజ్, కేశవరావు, ఆయూబ్, విశ్వక్ సేన్ రాజ్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరం

- నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్


భూమిపూజ చేస్తున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరం అని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ తెలిపారు.గురువారం నగరంలోని 16,20 వ డివిజన్ లలో సుమారు 20 లక్షల మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులకు నగర మేయర్ దండు నీతూ కిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత కౌన్సిల్ సమావేశంలో విడుదల చేసిన జనరల్ ఫండ్ తో అన్ని డివిజన్ లలో 10లక్షల నిధులతో పనుల ప్రారంభోత్సవానికి కృషి చేస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధికి ప్రభుత్వాల సహకారం అవసరమని 14వ, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల బకాయిల విడుదలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రత్యేక చొరవ తీసుకోని నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. తేనె సాయిబాబా మందిరం ముందు లైన్‌లోని బ్యాంకు కాలనిలో 10 లక్షల జనరల్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను, 16 డివిజన్ దుబ్బలోని ఎం కే గార్డెన్ ముందు లైన్‌లో 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు సిసి డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శన్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ పావని, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూములను కబ్జా చేస్తే ఖబర్దార్

- పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో మెయిన్ గేట్ వద్ద ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ భూములను కబ్జాచేస్తే ఖబర్దార్ అని, యూనివర్సిటీ భూములను కబ్జా చేస్తున్న, సహకరిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిని కాపాడాలని ప్రగతి శీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. టీయూకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 578 ఎకరాల స్థలానికి కేటాయించారన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు 50 ఎకరాల స్థలం కబ్జా చేశారని, విద్యార్థి పోరాటాలతో, జిల్లా కోర్టులో కేసు వేసి విజయం సాధించామన్నారు.ప్రస్తుతం యూనివర్సిటీ భూమిని హైకోర్టులో కేసు వేసి అన్యాయంగా అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, హైడ్రా పేరుతో ప్రభుత్వ భూములను ఎలాఅయితే స్వాధీన పరుచుకుంటున్నారో యూనివర్సిటీకి చెందిన ప్రభుత్వ భూమిని కూడా కాపాడాలని, కబ్జా చేస్తున్న వారిపై, వారికి సహకరిస్తున్న యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, రవీందర్, శివసాయి, వంశి , రాకేష్, స్రవంతి, రచన, గౌతమి, ప్రియ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిపి ఉంచిన వ్యాన్‌ను ఢీకొన్న బైక్

- యువకుడు మృతి


ప్రసాద్ మృతదేహం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో నిలచి ఉన్న హైచర్ వ్యాన్‌ను బైక్ ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గుత్ప గ్రామానికి చెందిన కల్లెడ ప్రసాద్(36) అనే యువకుడు నిజామాబాద్ సుభాష్ నగర్ కాలనీలో గల ద్వారకమాయి టిఫిన్ సెంటర్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. గురువారం ఆయన మోటార్ సైకిల్‌పై నిజామాబాద్ నుండి గుత్ప గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మామిడిపల్లి గ్రామ శివారులో 63వ జాతీయ రహదారిపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనాన్ని ఢీకొని గాయాలపాలై చనిపోయడన్నారు. మృతుని తమ్ముడు కల్లెడ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

దడవాయిల సంక్షేమానికి కృషి

- ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఫీక్ ఖాన్
- దడువాయి యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న దడువాయి యూనియన్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దడవాయిల సంక్షేమానికి కృషినని ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఫీక్ ఖాన్ అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ శ్రద్ధానంద్ గంజ్‌లో గల దడువాయి యూనియన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు మల్యాల గోవర్ధన్ గురువారం ప్రమాణం చేయించారు. గౌరవ సలహాదారులుగా మల్యాల గోవర్ధన్, ఎల్.అశోక్ అధ్యక్షులుగా ఎన్. శ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా ఆర్ రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా డి.ప్రవీణ్ కోశాధికారిగా ఎస్ ఉమేష్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఫీక్ ఖాన్ హాజరై మాట్లాడారు. గత పాలకవర్గాలు మార్కెట్ యార్డు వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడం వల్ల దడువాయి కార్మికులకు మార్కెట్ యార్డ్ పై ఆధారపడిన కార్మికులకు ఉపాధి కరవైపోయిందని అన్నారు, మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ ఐకెపి సెంటర్ల నిర్వహణలో దడ్వాయి కార్మికులకు మార్కెట్ యార్డు ద్వారానే డబ్బులు చెల్లించే విధంగా కృషి చేయాలని అన్నారు. దడువాయి కార్మికులను స్కిల్ లేబర్లుగా గుర్తించి కనీస వేతనాలను అమలు చేయాలని, పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో దడువాయులకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేష్ కుమార్ గౌడ్ పిసిసి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికై నిజామాబాద్ వస్తున్న సందర్భంగా నాలుగవ తేదీన జరిగే బహిరంగ సభలో మార్కెట్ యార్డు నుండి పెద్ద ఎత్తున కార్మికులు హాజరై స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో గుమస్తా సంఘం నాయకులు సత్యనారాయణ బాల ఆంజనేయులు, హమాలి యూనియన్ నాయకులు పరశురాం శ్రీహరి, దడువా యూనియన్ సలహాదారులు కే.రాజేంద్రప్రసాద్ ఎం స్వామి జివి పవన్ కార్యవర్గ సభ్యులు బసప్ప, పూజారి కృష్ణ, బండారి రాజు, ఆనంద్, శివప్రసాద్, గిల్ల సాయిలు, కొక్కు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వాగత కార్యక్రమానికి తరలిరావాలి'

నవతెలంగాణ-ధర్పల్లి

టిపిసిసి అధ్యక్షునిగా ఎన్నికైన మొట్ట మొదటి సరిగా జిల్లా కేంద్రానికి వస్తున్న మహేష్ కుమార్ గౌడ్ స్వాగత కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చెయ్యాలని జిల్లా కాంగ్రెస్ కిసాన్ ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం అయన విలేకరులతో మాట్లాడుతూ.. సొంత జిల్లా వాసికి పార్టీలో కీలక పదివి అధిరోహించిన శుభసందర్భంలో వారికి భారీగా తరలిరావాలని కోరారు.

స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలి

- డిపో మేనేజర్ ఆనంద్
- బస్టాండ్‌లో 'స్వచ్ఛత హి సేవా'


బసాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్ సీటీ

నిజామాబాద్ టిఎస్ఆర్ టిసి బస్టాండ్‌లో సీబీసీ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం టిఎస్ఆర్ టిసి బస్టాండ్ లో "స్వచ్ఛత హి సేవా" శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆనంద్ మాట్లాడుతూ.... 'స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత' నినాదంతో ఈ ఏడాది "స్వచ్ఛత హి సేవా" లో భాగంగా పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవాలన్నారు. స్వచ్ఛతను ఓ జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని స్వచ్ఛత పట్ల అవగాహన కలిగి ఉండలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లల్, బస్ స్టేషన్ మేనేజర్ శివ రాజమ్మ సిబిసి ఎఫ్‌పీఏ రషీద్, టిఎస్ఆర్ టిసి సిబ్బంది పాల్గొన్నారు.

పిసిసి చీఫ్ ర్యాలీకి కార్యకర్తలు తరలిరావాలి

మండల అధ్యక్షుడు సాయిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

పిసిసి అధ్యక్షుడి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా మహేష్‌గౌడ్ శుక్రవారం నిజామాబాద్ వస్తున్నారని మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులందరూ తరలిరావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయి రెడ్డి గురువారం తెలిపారు. స్వాగతం అనంతరం పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అనుమతి లేని డీజేలు నిషేధం


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నుండి లైసెన్స్ లేదా రాతపూర్వక అనుమతి పొందకుండా డీజేలు, లౌడ్ స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, సౌండ్ యాంప్లి ఫైయర్‌లను ఉపయోగించడాన్ని నిషేధించినట్టు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని సహస్ర ఫంక్షన్ హాల్లో, భీంగల్, ఏర్గట్ల, కమర్‌పల్లి, మోర్తాడ్, మండలాలకు చెందిన డీజే ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వాల్యూమ్ సౌండ్ ఎమిటింగ్ సిస్టమ్‌లను ఉపయోగిస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి అటువంటి పరికరాలను ఇన్‌స్టాల్ చేయడం, ఉపయోగించడం వల్ల సామాన్య ప్రజలకు అసౌకర్యం, ఆటంకాలు కలగడంతోపాటు ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డీజే, లౌడ్ స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మరియు సౌండ్ యాంప్లిఫైయర్‌ల వినియోగం నిషేధించినట్టు తెలిపారు. సమావేశంలో భీంగల్ సీఐ నవీన్, భీంగల్ ఎస్ఐ జి.మహేష్, ఏర్గట్ల ఎస్ఐ రాము, కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి, మోర్తాడ్ ఎస్ఐ విక్రం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు నీళ్ల కుండీలు ఏర్పాటు


ఏర్పాటు చేసిన నీళ్లకుండీలు పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పరిధిలోని 20, 5వ, వార్డులో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా సద్దుల బతుకమ్మ కోసం నీళ్ల కుండీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఆమె గురువారం ఆ వార్డులలో ఉన్న గుంతలను పరిశీలించి గుంతలు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ మొరం వేయించారు. ఇంకా ఏమైనా గుంతలు ఉంటే వాటిని పూడ్చాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ తైబ సుల్తానా సలీం, ఇమ్రాన్ మొయినుద్దీన్ లడ్డు, కాల గణేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని గిద్ద గ్రామంలో మండల పశువైద్యాధికారి రామచంద్ర ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. 25 పశువులకు సాధారణ చికిత్స, 32 గర్భకోశ వ్యాధుల చికిత్స, మూడు కృత్రిమ గర్భాధారణ, 42 పశువులకు నట్టల నివారణ మందుల సరఫరా చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలా పశువులు నట్టల సమస్యలతో ఉన్నాయని.. కళ్ళల్లో నుండి ఊసులు కారడం ఒక లక్షణమని తెలిపారు. రైతులకు పాడి పశువుల యాజమాన్యంపై, ఎద లక్షణం, సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ, దూడల పెంపకంలో మెలకువలు, పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో విఎల్ఓ శ్రీనివాసరావు, జెవిఓ నారాయణ, గోపాలమిత్ర హారిక, స్వామి, పశుమిత్ర మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో భారీ గాలివాన

ఆందోళనలో రైతులు


మండలంలో కురుస్తున్న భారీ వర్షం

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి మండలాల్లో గురువారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వాన కురిసింది. దీంతో రైతుల పంటలు పలుచోట్ల నెలకొరిగాయి. పంట చేతికొచ్చిన దశలో పంట కోసేందుకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు అంటున్నారు.

రెంజల్ ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సిద్ధి రామేశ్వర్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారిగా సిద్ధి రామేశ్వర్ గురువారం బాధ్యతలను చేపట్టారు. రెంజల్ వ్యవసాయ అధికారిగా నున్న లక్ష్మీకాంత్‌రెడ్డి భూసార పరీక్ష కేంద్రానికి బదిలీపై వెళ్లడంతో, ఆయన స్థానంలో సిద్ధిరామేశ్వర్ బాధ్యతలను తీసుకున్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అజయ్, గోపికృష్ణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రుద్ర గ్రీన్ ల్యాండ్స్‌లో ఘనంగా బతుకమ్మ


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి పరిధిలోని రుద్ర గ్రీన్ ల్యాండ్స్‌లో బతుకమ్మ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి భక్తిశ్రద్ధలతో లంగ్డాపూర్ వాగులో నిమజ్జనం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ల్యాండ్స్ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వరరావు, నేమాని సత్యనారాయణ, నగేష్‌బాబు పరుచూరి, గంగాధర్ పటేల్, హనుమంతరెడ్డి, జగ్గారావు, నాగార్జున్ గౌడ్, లక్ష్మణ్, రాంరెడ్డి, కమ్యూనిటీ వాసులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ జైల్‌సింగ్ నాయక్‌కు నివాళి

నవతెలంగాణ-దోమకొండ


నివాళి అర్పిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో గురువారం మరణించిన మచారెడ్డి మండల ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ జైల్‌సింగ్ నాయక్‌కు దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో ఉపాధి హామీ టెక్నికల్ రాజేశ్వర్, లింగం, సిబ్బంది, మండల పరిషత్ అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో గల పోచమ్మ వాగులో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడి వయస్సు 45 ఉంటుంది. తమిళ్‌లో ఏదో రాసి ఉండగా.. (దాన్ని తెలుగులో అనువదించగా వాసుమి అని రాసి ఉంది.) మృతుడి ఒంటిపై బూడిద రంగు టీషర్ట్, నల్లని నిక్కర్ ఉన్నది. మృతుని వివరాలు తెలిసిన వారు 8712686165 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ కార్డ్ కోసం
సర్వే పక్కగా అమలు జరగాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి


సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ఈ నెల 3 నుంచి జరగనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పక్కాగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. గురువారం బాన్సువాడ మండలంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ రేషన్ కార్డ్ తప్పనిసరి అని భావిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సర్వే నిర్వహించాలని ఆదేశాలు మేరకు నేడు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని నాగారం గ్రామపంచాయతీ పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైనందున ఎంపీడీవో బషీరుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. కుటుంబ జాబితాను రూపొందించి యూనిట్ నెంబర్ కలిగిన డిజిటల్ రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన నాగారం గ్రామపంచాయతీని సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆకస్మికంగా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వే పక్కగా అమలు జరగాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషరుద్దిన్, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, సెక్రటరీలు నవీన్, సృజన్‌రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ సీటు కాంగ్రెస్‌దే



మున్సిపల్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ సీటును కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎల్లారెడ్డి ఆర్డీవో ఎన్నికల అధికారి మన్నే ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల్లో 8 మంది కౌన్సిలర్లు కలిసి ఎల్లారెడ్డి పురపాలక సంఘం చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్‌ను బలపరచడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆర్డిఓ మన్నె ప్రభాకర్ నియామకపత్రాన్ని అందించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అఫీషియో హోదాలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల్లో లోపాలుండొద్దు

- ఎంపీడీవో చంద్రోదయ కుమార్


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-బీబీపేట్

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో బతుకమ్మ ఘాట్ల వద్ద సౌకర్యాలు లోపించవద్దని ఎంపీడీవో బంతిపూర్ణ చంద్రోదయ కుమార్ గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ 15 రోజుల్లో చేసిన కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. అలాగే రాబోయే బతుకమ్మ, దసరా పండుగలకు గ్రామస్థాయిలో లైటింగ్ ఏర్పాటు, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం, చెరువుల బతుక మ్మ ఘాట్‌లను పరిశీలించి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణ, ఆయా గ్రామాల పంచా యతీ కార్యదర్శులు, మండల పరిషత్ కంప్యూటర్ ఆపరేటర్లు, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమాచెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నల్లమడుగు తండాకు చెందిన దనవత్ శ్రీనివాస్ కుటుంబానికి గురువారం ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు రెండు లక్షల బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును అందజేశారు. నల్లమడుగు తాండకు చెందిన ధరావత్ శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి పడి మృతి చెందాడు. మృతుడు బి.ఆర్.ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో ప్రమాద బీమా ద్వారా మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్కును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని కుటుంబానికి భరోసానిచ్చారు. ఆయన వెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ సంపత్ గౌడ్, నాయకులు ముదాం సాయిలు, గన్నునాయక్, బండి నర్సింలు, గాండ్ల నర్సింలు, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవి, లక్ష్మణ్, నర్సింలు, మోతే సిద్ధరాములు, మహిపాల్‌రెడ్డి, నరేష్, కాముని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు


మాట్లాడుతున్న కైలాస్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మొట్టమొదటిసారిగా కామారెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా ఆయనకు జరిగే సన్మాన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సన్మాన కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌లు హాజరవుతారన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలకాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గురుకుల శ్రీనివాస్, కౌన్సిలర్ పంపరి లక్ష్మణ్, లక్కబత్తిని గంగాధర్, బట్టు మోహన్, తేజ ప్రసాద్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుకై ఇంటింటి సర్వే

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

అర్హులైన వారందరికీ డిజిటల్ కార్డు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా గురువారం బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లి కార్జున్‌రెడ్డి, నాయకులు అమీర్ చావుస్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

అచ్చాయిపల్లిలో డిజిటల్ హెల్త్ కార్డు సర్వే ప్రారంభం


సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని అచ్చాయిపల్లి గ్రామంలో గురువారం డిజిటల్ సర్వే ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద అచ్చాయిపల్లి ఎంపికైందిన, తద్వారా పల్లిలో ముందుగా డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌తో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం గ్రామపంచాయతీలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ మాలోత్ సంగ్యానాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగ నాయక్, బాల్యా నాయక్, సంతోష్ నాయక్, మంగ్యా నాయక్, యాచారం మాజీ సర్పంచ్ లతా రమేష్, తండా పెద్ద మనుషులు శాలువాతో సన్మానం చేసినట్లు తెలిపారు.


పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ మత్తడిపల్లి శివారులో గల వరి పంటలను గురువారం ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారులు స్థానిక గ్రామ రైతులతో కలిసి పరిశీలించారు. శివారులో కొంతమేర పంటలకు దోమ తెగుళ్ల ఆశించిందని, ఈ దోమ కాండం పైన రసం పీల్చడం వలన వరి దుంపలు ఆకులు ఎండిపోవడం గమనించినట్లు పేర్కొన్నారు. దీనివలన పంట దిగుబడి తగ్గుతుందని, కాబట్టి రైతులు ఒక ఎకరంపై మెట్రోజెన్ అనే మందు 200 లీటర్ల నీటిలో 120 గ్రాముల మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రాజా గౌడ్, ముఖీద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంద గంగారెడ్డి, రైతులు నర్సారెడ్డి, సాయిరెడ్డి, జంగిటి వెంకట్, అశోక్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బీబీపేట్



మండలంలోని ఇస్సానగర్ గ్రామ నివాసి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గన్నమనేని రాజురావు తండ్రి గన్నమనే రామచంద్రరావు అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించగా అట్టి కుటుంబాన్ని గురువారం మాజీ కామారెడ్డి శాసనసభ్యులు గంప గోవర్ధన్ పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్దను కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన వెంట మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీపీ బాలమణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచాల శేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దేవునిపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పొట్టిగారి పొట్టయ్య, గ్రామ అధ్యక్షులు మన్నె కుమార్, మాజీ అధ్యక్షులు లింగాల రమేష్ గౌడ్ తదితరులున్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతుల బతుకులను రోడ్డున వేసింది
- వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


ధర్నాలో మాట్లాడుతున్న జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలను బతుకులను రోడ్డున పడేసిందని ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కామారెడ్డి ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు సురేందర్ మాట్లాడుతూ.. బూటకపు హామీలతో దొంగ హామీలతో గద్దెనెక్కి నేటికీ 303 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు రుణమాఫీ కాక రైతులు బ్యాంకులచుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేయాలని, అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.15000 వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు రూ.15000 ఇవ్వాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో ఆడుతున్న డ్రామాను ప్రజలందరూ గమనిస్తున్నారని, అలాగే కావాలని కొంతమంది మహిళా మంత్రులతో బట్ట కాల్చి మీద పడేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులకు ధాన్యం పండించిన ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి మోసం చేశాడని అన్నారు. ప్రభుత్వం తక్షణమే రెండు లక్షల రుణమాఫీ చేయకుంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడి ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. రైతులకు భేషరతుగా ప్రతి ధాన్యంకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. అక్కడ సరైన సదుపాయాలు లేక రోగులు బాధపడుతున్నారని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ నరేందర్‌కు రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్ శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహులు, నల్లమడుగు సింగిల్‌విండో చైర్మన్ రమేష్, ఎంపీపీ ముదాం సాయిలు, రవీందర్, బొల్లు శ్రీకాంత్, పర్వయ్య, పరంధాములు, రాములు, విట్టల్, సర్వర్ నాయక్, మైపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాపూర్ బెల్ట్‌షాప్‌పై ఆబ్కారీ పోలీసుల దాడి?

- గోప్యంగా ఉంచిన ఆబ్కారీ పోలీసులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్‌లో బెల్ట్‌షాప్‌పై ఆబ్కారీ పోలీసులు గురువారం దాడి చేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అతనిపై కేసు నమోదు చేశారా, లేదా అనేది నవతెలంగాణ ఆబ్కారీ సీఐ, ఎస్సైలకు చరవాణిలో వివరణ కోరేందుకు ప్రయత్నించినా.. స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో గతంలో కూడా అక్రమాలపై దాడులు చేసి, విషయాలను గోప్యంగా ఉంచారని ఆబ్కారీ అధికారులపై ఆరోపణలున్నాయి. ప్రతి గ్రామంలో వారి కనుసైగలోనే బెల్ట్‌షాపులు నడుస్తున్నాయని, నడుస్తున్న మామూలుగానే తీసుకుంటున్నారని, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

నటరాజ నృత్యానికేతన్‌కు వరల్డ్ రికార్డులో చోటు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన నటరాజు నృత్యానికేతన్‌కు ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కినట్టు నాట్య గురువు భాషెట్టి మృణాళిని తెలిపారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ సారస్వత పరిషత్‌లో గురువారం నటరాజ నృత్య నికేతన్ కళాకార్ తెలుగు టీవీ సంయుక్తంగా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బోల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో భాగంగా 155 వ మాత్మ గాంధీ జయంతినీ పురస్కరించుకొని 155 మంది చిన్నారులతో 155 నిమిషాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి దైవజ్ఞ శర్మ, సరస్వతి ఉపాసకులు డాక్టర్ కే అరవింద్, డాక్టర్ నలంద, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె వి రమణ రావు విచ్చేసి చిన్నారులకు అవార్డ్ సర్టిఫికెట్లు అవార్డులు ప్రదానం చేసినట్టు తెలిపారు.

నూతన ఏసీపీకి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

నూతన ఏసిపిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ రెడ్డిని గురువారం సన్మానించినట్టు జీజీ ఫౌండషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన గుజరాతి తెలిపారు. ఈ సందర్భంగా లయన్ నివేదన గుజరాతి మాట్లాడుతూ.. పట్టణంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గంజాయి ముఠాలపై ప్రతేక దృష్టి సారించి వాటికి పాటుపడుతున్న నిర్వాహకులను అదుపులో తీసుకోని కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, గోల్డ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మంచిర్యాల కిషన్, లోటస్ విద్యాసంస్థల చైర్మన్ ప్రవీణ్ పవార్, జెస్సు ఆనంద్, స్వాతి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్పీ మండల అధ్యక్షునిగా మైపాల్

- రాష్ట్ర నాయకుడు ప్రేమ్



సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

డిఎస్పీ మండల అధ్యక్షునిగా మైపాల్ ఎన్నుకున్నారని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు ప్రేమ్ తెలిపారు. గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మండలస్థాయి సమావేశంలో మండల అధ్యక్షునిగా రామడుగు గ్రామానికి చెందిన మహిపాల్ ఏకగ్రీవంగా నియమితులయినట్లు గురువారం తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన విశారదన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటానని, అందరిని కలుపుకొని పార్టీ కార్యక్రమాలను చేపడతానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహిపాల్, రూరల్ ఇంచార్జ్ ప్రశాంత్, డిచ్‌పల్లి అధ్యక్షుడు శుభాష్, నాయకులు కిషన్, నగేష్, బాబు, సాయిలు, గంగాధర్, నర్సయ్య భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

సహారా పేమెంట్ చెల్లించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

సహారా పేమెంటు చెల్లించాలని సహారా బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పూజిత అన్నారు. పట్టణంలో గురువారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నుంచి డబ్బులు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వంపైన సహార సంస్థపై ఒత్తిడి తీసుకొస్తున్న డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎలక్షన్ ముందు పోర్టల్ విధానం తీసుకొచ్చిపోర్టల్ ద్వారా అప్లై చేసుకుంటే డబ్బులు చెల్లిస్తామని అమీషా ప్రకటిస్తే నాలుగు కోట్ల మంది దేశంలో అప్లై చేసుకుంటే కేవలం 20 లక్షల మందికి 10వేల చొప్పున ఇచ్చారన్నరు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి దాసు మాట్లాడుతూ భవిష్యత్తులో డబ్బులు పనికి వస్తాయని గంపేడు ఆశతో సహార సంస్థలో పొదుపు చేసుకుంటే నయ పైసా ఇయ్యకుండా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు పొదుపు చేసుకున్న డబ్బులుప్రజలకు తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సహారా బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలయ్య మాట్లాడుతూ డబ్బుల్ని తిరిగి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నరేందర్, నరసయ్య, నారా గౌడ్, రమేష్, గంగాధర్, భూమేష్, సాయిలు, వేణు గౌడ్, రవి, గజేందర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

శుద్ధమైన నీటిని అందించాలి

- మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్
- గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ




మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

శుద్ధమైన నీటిని అందించాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ అన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో మిషన్ భగీరథ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. లీకేజీలు లేకుండా మిషన్ భగీరథ నీటిని ప్రజలకు అందజేయాలని అన్నారు. వాటర్ లికేజీలు ఉంటే మిషన్ భగీరథ అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ నీటిని తాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యస్‌ఈ రాజేందర్ కూమార్, ఈ ఈ ప్రెష్, డి ఈఈ గంగారం,ఏఈ మెహన్ రెడ్డి, ఎంపిడిఓ సతీష్ కుమార్,యంపిఓ యూసుఫ్ ఖాన్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల గోపి , చైన్ మెన్ లు రోడ్డ సాయన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న పి.రవళిక అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైందని స్కూల్ పిడి ముత్తెన్న గురువారం తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 17 తైక్వాండో విభాగంలో రవళిక ఉత్తమ ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. ఈ నెల 17,18,19 తేదీలలో గద్వాల్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాద్యాయ బృందం అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం సీబీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రమదానంతో పాటు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవాలన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో యువతి, యువకులు చురుగ్గా పాల్గొని ప్రతి ఒక్కరికి స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు తడి చెత్త పొడి చెత్తను ఇలా వేరు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మ నాయక్, కాకతీయ కళాశాల ప్రిన్సిపల్ రణవీర్, సిబిసి ఎఫ్ పీఏ రషీద్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో డీజే వాడకం నిషేధం

- నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజ వెంకటరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో డీజేను నిషేధిస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఉత్తర్వులను జారీ చేసినట్టు నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా లో డీజే వాడకం, నిషేధంపై డీజే షాపు నిర్వాహకులు యాజమాన్యాలతో నగరంలోని అంబేద్కర్ భవన్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాదు ఒకటవ పోలీస్ స్టేషన్ అధికారి రఘుపతి, నిజామాబాద్ సర్కిల్ అధికారి శ్రీనివాస్ రాజ్, నిజామాబాద్ సౌత్ రూరల్ అధికారి సురేష్ కుమార్, ఇతర అధికారులు నిజామాబాద్ నగర ఇతర చుట్టుపక్కల ఉన్న సౌండ్ సిస్టంలు కిరాయి కి ఇస్తున్న యజమానులకు, సౌండ్ సిస్టంలు అమ్ముతున్న యజమానులకు అంబేద్కర్ భవన్ లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సౌండ్ సిస్టం వాడకం వల్ల జరిగే ఆరోగ్య సమస్యలు వివరించారు. ఏసిపి నిజామాబాదు నుండి పర్మిషన్ ఉన్న ఫంక్షన్స్‌కి మాత్రమే సౌండ్ సిస్టం కిరాయికి ఇవ్వాలని తెలిపారు. లేని యెడల సౌండ్ సిస్టం పెట్టిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డిచ్‌పల్లి : ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో డి జె లను నిషేధించినట్టు ఇందల్ వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి నుండి ఎటువంటి ఏ కార్యక్రమంలో నైనా డిజెలు, అంప్లిఫైర్స్, బాణసంచాలు ఉపయోగించొద్దని పేర్కొన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఇందుకోసం ప్రజలు, యువకులు సహకరించాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

చక్కెర ఫ్యాక్టరీలను నడిపించాలి

- సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిసిసి అధ్యక్షుని హెూదాలో జిల్లాకు తొలిసారిగా వస్తున్న బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను అభినందిస్తున్నామని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు ఆకుల పాపన్న మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో గల రెండు చక్కర ఫ్యాక్టరీలను నడపాలని, చక్కెరకి బదులుగా బెల్లం ఫ్యాక్టరీ గా ఎన్సిఎస్ఎఫ్ ను మార్చాలని, సహకార సంఘంలో కొనసాగించాలని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ భూములను కాపాడుకోవడానికి ప్రయత్నించాలి. ఇంజనీరింగ్ కాలేజ్‌ని తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని, బిక్నూర్ క్యాంపస్‌లో ఉన్న కోర్సులను తెలంగాణ యూనివర్సిటీకి మార్చాలని అన్నారు. పసుపు బోర్డును ఏర్పాటు చేసి పసుపు సంబంధిత ఫ్యాక్టరీలని ఏర్పాటు చేయాలన్నారు. టమాటకు సంబంధించి సాస్, కెచప్ వంటి వాటిని తయారు చేసే యూనిట్‌ను నిజాంబాద్ లో ఏర్పాటు చేయాలన్నారు. మొక్కజొన్న నుండి వచ్చే జుట్టు కిడ్నీ సంబంధిత వ్యాధుల నివారణకు తోడ్పడుతుందని, దానిపై పరిశోధన చేసి దాని యూనిట్‌ను నిజామాబాద్‌లో ఏర్పాటు చేయాలని తెలిపారు. రుద్రూర్ శాస్త్రవేత్తలు గడ్డి నుండి విలువైన గ్యాస్ ను ఉత్పత్తి చేయవచ్చునన్నారని, దానిపైనా పరిశోధనచేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రయత్నించాలని అన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ కార్పొరేషన్‌లకు జాప్యం లేకుండా నిధులను విడుదల చేయాలని, నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో గల కుటుంబాలన్నిటికీ మంచినీరు అందేలా నల్లానీటి కలెక్షన్స్ ఇవ్వాలన్నారు. వర్షపు నీటిని కూడా వాడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీది తక్షణమే పూర్తి చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని, మాసాని, రఘునాథ్ ట్యాంక్ కాలువలు కబ్జా కాకుండా చూస్తూ సిమెంటు లైన్లు వేయాలన్నారు. 33 కేవీ లైను ఎప్పుడో వేశారో కాబట్టి దాన్ని మార్చి కొత్తగా వెయ్యాలన్నారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, నగర నాయకులు ఎం. శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

యూనివర్సిటీలో బతుకమ్మ ఉత్సవాలు

- ప్రారంభించిన రిజిస్ట్రార్ ఎం యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్‌లో గురువారం నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి మూలం బతుకమ్మ పండుగ ఒకటన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రాంత ప్రజలందరికీ బతుకు నిస్తుందని బలంగా నమ్ముతారన్నారు.తెలంగాణ ప్రాంతంలో గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు బొడ్డెమ్మ పండగను పెళ్లి కానీ ఆడపిల్లలు 9 రోజులు ఆడతారని మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిదవ రోజు సుద్దుల బతుకమ్మతో ముగుస్తుందన్నారు. ప్రకృతిలో దొరికే అన్ని రకాల పూలను ఒకచోట చేర్చి బతుకమ్మను తయారు చేస్తారన్నారు.ఈ బతుకమ్మను ఎంతో నిష్టతో తయారు చేసి సాయంత్రం స్త్రీలందరు ఒకచోట చేరి పూజించి చివరగా చెరువులో నిమజ్జనం చేస్తారన్నారు. దీని వల్ల చెరువులో ఉన్న నీరు స్వచ్ఛంగా తయారై పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ వర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ అరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, ప్రొఫెసర్ లావణ్య విజయలక్ష్మి, డాక్టర్ నీలిమ అధ్యాపకురాళ్లు, సిబ్బంది, విద్యార్థి నులు పాల్గొని బతుకమ్మ పండుగ గొప్ప తనాన్ని ఆటపాట ద్వారా తెలియజేశారు.



యూనివర్సిటీలో బతుమ్మ వేడుకలు

ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం విద్యార్థి

- క్షత్రియ పాఠశాలలో సీబిఎస్‌ఈ ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ శిక్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ శివారు సీబీఎస్‌ఆర్ట్ ఇంటిగ్రేషన్, విజయవాడ సౌజన్యంతో గురువారం శిక్షణా తరగతులను నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని క్షత్రియ విద్యా సంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. "వెన్యు డైరెక్టర్, డిప్యూటీ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పర్యవేక్షణలో నిర్వహించడిన ఈ శిక్షణా తరగతుల కార్యక్రమానికి జయశ్రీ హుల్సార్ ప్రిన్సిపల్ జి. పుల్లారెడ్డి, మెమోరియల్ స్కూల్, హైదరాబాద్ శుచి భరద్వాజ్ ప్రిన్సిపల్ శ్రీ విద్యా విహార్ స్కూల్, హైదరాబాద్ రిసోర్స్ పర్సన్లు విచ్చేశారు. క్షత్రియ స్కూల్ చేపూర్, సెయింట్ ఆన్స్ హై స్కూల్ ఆర్మూర్, నిర్మల్ లోని వాసవీ వరల్డ్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ సెంటర్ డైరక్టర్, క్షత్రియ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ నరసింహ స్వామి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని అన్నారు. ఈ ఆధునిక సమాజంలో తెలుసుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని అందుకే ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుడు తనకున్న జ్ఞానంతో సంతృప్తి చెందకూడదని, ఆధునిక జ్ఞానాన్ని పొందడానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. క్షత్రియ విద్యా సంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా తరగతులను మరిన్ని నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ అనుభవాలను వివరిస్తూ తరగతి బోధనకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడ్తాయని సంతోషాన్ని వ్యక్తం చేసినారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

రైతులు సోయ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ మండలం కల్దుర్కి సొసైటీ పరిధిలోని సిద్ధాపూర్ రైతువేదికలో నిర్వహించిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన సోయా, ధాన్యం పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర పొంది లాభాలు పొందాలన్నారు. అలాగే రైతులకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా రైతు రుణమాఫీ అందరికి వర్తిస్తుందని ఎవరు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. సాలూర, హున్స గ్రామాలలో స్టేట్ కోఆపరేటివ్ చైర్మెన్ మోహన్‌రెడ్డి సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు శరత్, జనార్ధన్, మందర్న రవి, సహకార సంఘాల సీఈవోలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులవల్లే ఆరోగ్యంగా ఉంటున్నాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పారిశుధ్య కార్మికులు పనులు చేయడంవల్లే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని, అందరం ఆరోగ్యంగా ఉంటున్నామని జిల్లా యోజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని గాజుల్ పేట్, ఖిల్లా ప్రాంత మున్సిపల్ కార్మికులను ఆమె అభినందించారు. ఈ రెండు ప్రాంతాలలోని ఉత్తమ సేవలను అందించిన పారిశుధ్య కార్మికులను గుర్తించి సానిటరీ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో సుజాత, మాధవి, మల్లేశం, సాయిలు లక్ష్మణ్, సంజీవ్‌ను సన్మానించి ప్రశంసించారు. సిబ్బందికి అల్పాహారం అందించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, గోపి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలి

- ఐఎఫ్‌టీయూ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు కనీస వేతనం 26,000 రూపాయలు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది కానీ ప్రభుత్వం తీర్పు అమలు చేయడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంటు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్, జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్, అబ్బయ్య సంజీవ్, సూది రవి, రామ కృష్ణ, రాజేశ్వర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

సంఘ నిర్మాణ పనులకు రూ.25 వేలు అందజేత



నగదు అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

నాయకుడు ఫౌండేషన్ ముప్కాల్ ఆధ్వర్యంలో ఫౌండర్ అండ్ చైర్మన్ నాయకుడు సంతోష్ గురువారం వేంపల్లి గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘ నిర్మాణ పనులకు రూ. 25 వేల రూపాయలను అందించారు. నగదును ఫౌండేషన్ సభ్యులు సంఘ పెద్దలకు అందజేశారు. అనంతరం సంఘ పెద్దలు నాయకుడు సంతోష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెంకట నర్సయ్య, భరత్ రాజ్, ముత్యం, రాజశేఖర్, రాకేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ రీజియన్ కు కేటాయించిన మొత్తం 64 ఎలక్ట్రికల్ బస్సులలో తొలి విడత 13 బస్సులు ఇక్కడికి చేరుకున్నాయి. ఈ బస్సులు నిజామాబాద్ నుండి జేబియస్. రూట్లలో నడపనున్నారు. అద్దె ప్రాతిపదికన (జీసిసి. - గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్) నడిపే ఈ బస్సులు ఆపరేషన్, ప్రర్యవేక్షణ మొత్తం ఆర్టీసియే చూసుకుంటుంది. శుక్రవారం నిజామాబాద్ ప్రధాన బస్ స్టాండ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈబస్సులు ప్రారంభించనున్నారు. ఈ బస్సు ప్రత్యేకతలు కాలుష్య కారక ఉద్గారాలు లేని బస్సులు, ఈ బస్సులు 12 మీటర్ల పొడవు ఉంటాయి. పూర్తిగా ఎలక్ట్రిక్ బ్యాటరీలతో ఆపరేట్ చేస్తారు. (369 కేడబ్ల్యూహెచ్ గల 12బ్యాటరీలు ఉంటాయి). యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టంతో ముందు వెనుక పూర్తి ఎయిర్ బ్రేక్ సిస్టం. ప్రయాణీకుల భద్రతకై 4 సి.సి. కెమెరాల ఏర్పాటు (లోపల- 03, బయట - 01), వెహికల్ ను ట్రాక్ చేయు సౌలభ్యం కల్పించబడింది. 41 సీట్ల సామర్థ్యము - సీట్లు వెనుకకు వంచుకొను సౌలభ్యం. చార్జి వివరాలు పెద్దలకు: రూ.లు 360, పిల్లలకు: రూ.లు - 220 ఉంటుందని తెలిపారు.